వంటింటి లెక్చర్లు (2)

# పంచదార ప్రహసనం

"మొన్న ఒక సినిమాతార బంగ్లాదేశ్ శరణార్థుల సహాయనిధికి కట్టుకున్న చీర విప్పేసి యిచ్చేసిందిట" అన్నారు మా వారు వస్తూనే మొహం యింత చేసుకుని ఆ సభలో తను వున్నట్లు.

"పోండి కోతలు" అన్నా.

"కాదే భామా-మన దేశంలో యిప్పుడు పాపం పెరిగినట్లు దేశ భక్తి పెరుగుపోతోంది" అన్నారు వారు వ్యంగ్యంగా.

"చాల్లెండి, వింటే ఎవరైనా నవ్వీపోతారు"

"నవ్వటం కాదే-ప్రతి దుకాణంవాడూ ప్రతి వ్యాపారీ యిప్పుడు దేశభక్తుడే. వాళ్ళు చేసే పాపాలన్నీ కడుక్కోటానికి ఈ పాకిస్తాన్ యుద్ధం వచ్చింది."

'యుద్ధకాలంలో చూడు! పంచదార ధర పెరిగినట్లు దేశభక్తి పెరిగిందో లేదో....'

"అయితే ఒక ఇన్‌లాండ్ కవరు పట్రండి, పెనసలు పట్రండి వెంటనే"

"ఎందుకు ?"

"ఇందిరాగాంధికి ఉత్తరం రాసిపారేస్తాను. ఇంట్లో చెంచాడు పంచదారకూడా లేదు."

"ఆవిడేం చేస్తుంది పాపం ఆవిడ నీకేవన్నా గ్లాసుడు పంచదార అప్పిస్తుందా?"

"ఆవిడే కదండీ మనకు హెడ్డు, పంచదార గురించి గట్టిగా కనుక్కో-మని రాస్తాను."



"బావుండదు, ఆవిడేమన్నా అనుకుంటుంది. ఇప్పుడావిడ దేశంలో దేశభక్తి బాగా పెరిగిందని సంతోషిస్తున్నది. పంచదార గురించి చెప్పి మనవాళ్ళ దేశభక్తి ఎంతో ఆమెకు తెలియచెయ్యటం అట్టే మంచిదికాదు, రాబోతున్నాయి ఎలక్షన్లు. పంచదార కార్డు ఎవడిస్తే వాడికి ఓటు."

"మరి మనం కూడా దేశభక్తి చూపించొద్దుటండీ."

"వద్దులే-అందరూ చూపిస్తే ఎల్లాగ? దేశం ఏమయ్యేట్టు?"

"మనం ఓ పనిచేద్దావా ?"

"ఏవిటి?"

"మన బుజ్జిగాడిన్ని డ్రస్‌చేసి పవుడరద్ది మహిళామండలికి తీసుకెల్దాం, అక్కడో కుర్చీలో కూర్చోబెట్టి ముద్దెట్టుకున్న వాళ్ళందరి దగ్గరా తలకో రూపాయి వసూలుచేసి దేశరక్షణనిధికి యిద్దాం"

"ఏడిసినట్లుంది నీ సలహా —"

"అదేవిటండీ అలాగంటారు—"

"వుండుండు నాకోటి తోస్తోంది."

"చెప్పండీ చప్పున–చంపక"

"ఆగవే చెప్తాను."

"ఆగను"

"సరే చెప్పాక నువ్వు ఏమీ అనుకోకూడదు."

"ఎందు కనుకోనూ—"

"అల్లాఅయితే చెప్పను, నా అయిడియా నా దగ్గరే వుంటుంది."

"అల్లాగే వుంచుకోండి, మీవన్నీ తెలివి తక్కువ అయిడియాలు"

"సర్లె–ఎందుకైనా మంచిది, నీతో చెప్పకపోవటమే మేలు"

"అబ్బ చెప్పండి, మన్లో మనకేవిటీ బెట్టుసరి"

"బెట్టుసరి కాదే-తీరా చెప్పాక నన్ను తిట్టొద్దు"

"ఏవిటి అంత ఛండాలంగా వుంటుందా మీ అయిడియా–"

"అదుగో – నీ మొహం చూస్తోంటేనే నాకు భయం భయంగా వుంది. చెప్పకుండా వుందామంటే యింత ఒరిజినల్ అయిడియా మనతో పాటు మనలోనే వుండి కుళ్ళిపోతుందనే బెంగ ఒక పక్క—నాకేమీ పాలుపోవటం లేదు."

"అది దేశానికి లాభవా నష్టవా? నష్టమైతే చెప్పకండి."

"దేశానికి లాభవేఁకాని వింటే నామీద కారాలూ మిరియాలూ నూరుతారేమోనే ఖర్మ."

"పోనీ కాయితంమీద రాసివ్వండి. పట్టిగెళ్ళి మా మహిళా మండలిలో చూపిస్తాను."

"చూపిస్తావా?"

"ఆల్ రైటుగా"

"దట్సాల్-ఇలారా దగ్గిరసా చెవిలో చెప్తా."

"ఓస్, తెలుసులెండి. మీకింకేం పనిలేదు, పోకిరీ కబుర్లూ పోకిరీ వేషాలూనూ-"

"నువ్వు వినకుండానేమాటలనేస్తున్నావ్-వింటే ఇంకేమన్నా వుందీ? అయినా నాకెందుకు?"

"చెప్పండీ ఊరించి చంపక"

"ఆ ఏవీలేదే-మీ మహిళామండలిలో కొంతమందైనా కనుముక్కు తీరు వున్నవాళ్లున్నారు కదా!"

"లేకేమి? వుంటారుంటారు."

"వుంటే వాళ్ళని ఓ బల్లవేసి అందుమీద చక్కగా నించోపెట్టి ముద్దుకో రూపాయి వసూలుచేస్తే అబ్బో లక్షలకు లక్షలు దేశరక్షణ నిధికి వసూలవుతుందని నాకో అయిడియా వచ్చింది."

"ఛీ! ఛీ! ఇదా మీ బోడిసలహా-మన సంస్కృతి, మన నాగరికత, మన సభ్యత యివన్నీ ఏ గంగలో కలిసిపోయాయండీ ? చివరకు మీకిల్లాంటి బుద్ధులు పుడుతున్నాయేమా అని నాకాశ్చర్యంగా వుంది. మీ మనస్సు నైతికంగా ఎంత పతనమయిందీ?"

"అందుకే చెప్పనన్నాను. చెప్పేదాకా చంపుతావు, తీరా చెప్పాక తిడతావు."

"మా మహిళామండలిలో ఈ సంగతి చెప్పమనా మీ ఉద్దేశం-"

"నీకు ధైర్యముంటే చెబుతావు అది నీ యిష్టం—"

"షటప్! నాకు మిమ్మల్ని చూస్తూంటే వళ్ళు మండిపోతోంది"

"దేశభక్తి చూపిద్దామని ముందు అన్నది నువ్వా, నేనా?"

"అయితే యిదిటండీ మనం యిచ్చే సలహా?"

"ఏముందే యిందులో-ఒక ముద్దుయిచ్చి ఓ రూపాయి పుచ్చుగోడం చిల్లర లేదంటే చిల్లరివ్వకుండా అన్నీ ముద్దులే యిచ్చేయడం."

"అయ్యో! అయ్యో!"

"సినిమాతార ల్నెవర్నేన్నా పెడితే పదిరూపాయలదాకా వస్తుంది. పైగా మనకు ఎంత దేశభక్తి వుందో లోకానికి అక్షరాలా రూపాయల్లో లెక్కకట్టినట్లు తెలుస్తుంది. నన్నడిగితే ఈ అయిడియాను నేను టాటాస్ బిర్లాస్‌వాల్కియాలకిస్తే వాళ్ళు ప్రయివేటు రంగంలో కోట్లకు కోట్లు సంపాదిస్తారు. ఒక బ్రూకాఫీ కొంటే ఒక సబ్బుబిళ్ళ పెట్టి. ఒక బోర్నవిటా కొంటే ఒక కప్పు యిచ్చినట్లే—పెట్టుబడి ఒక చిన్న ముద్దు. అంతే — వెరీ సింపుల్."

"ఫోన్‌చేసి డాక్టర్ని పిలవమంటారా?"

"ఎందుకూ?"

"మీ మైండు చెడింది. చూపిస్తే మంచిదని"

"సర్లే—తెరమీద ముద్దెట్టుకోవడం తప్పన్నారు గాని ఈ పంచదార దొరకని రోజుల్లో ముద్దుకంటె తియ్యగా వుండేది లేదని చెప్పానంతే-నీకు మరీ అంత కోపమైతే ఎల్లాగ?"

"చాల్లెండి సంతోషించాం తెలివికి -"

"మీకు ఆడవాళ్లకి దేశభక్తి లేదా—వుంటే మీరిలాగ మాట్లాడరు."

"అయ్యో మీరీ వంటింటి లెక్చర్లు మానేసి బయటికి దయచేస్తారా?"

"యస్ యువరానర్"